# చీకటి విసిరిన నిశ్శబ్దం!

- శారదా అశోకవర్ధన్



వాళ్లూ వెళ్లగానే తలుపు గభాల్న వేసి గడియపెట్టింది పార్వతి. ఆ చప్పుడుకి శివప్రసాద్ ఉలిక్కిపడ్డాడు. అవంతికి అర్థమయిపోయింది, కాస్సేపట్లో అగ్నిపర్వతాలు బద్దలయ్యాయా అన్నంత తీవ్రంగా పార్వతి స్థాయి పెరిగి దండకం మొదలెడుతుందని. అందుకే అవంతి అక్కడ కూర్చోలేక పక్క గదిలోకెళ్లిపోయింది. శివప్రసాద్ కూడా లేవబోయాడు.

"కూర్చోండి! మీరెక్కడికి? అది వెళ్లగానే తోకలాగామీరూ దాని వెనకాలే వెళ్లాలా?" ఉరుములా వుంది కంఠం. శివప్రసాద్ మాట్లాడకుండా కుర్చీలో కూర్చున్నాడు.

"వీళ్ల మొహాలు చూస్తే మీకేమనిపిస్తోంది?" అదే స్థాయిలో ప్రశ్నించింది.

"మొహాలుచూసి ఏం చెబుతాం? వాళ్లు ఇంటికి వెళ్లి మాట్లాడుకుని నాలుగయిదు రోజుల్లో ఏ సంగతీ చెప్తామన్నారుగా! చూద్దాం" అన్నాడు ప్రశాంతంగా శివప్రసాద్. ఆయనకి తెలుసు పార్వతి మూడ్ చూసి మాట్లాడడం. ఆమె అపరకాళిలా అరుస్తూంటే, ఆయన కంఠం అసలు పలకదు.

"ఏమిటి వాళ్లు చెప్పేదీ మనం చూసేదీ? వాళ్ల మొహాలు చూస్తే మీకర్థం కాలేదేమో కానీ నాకర్థమయింది. పచ్చి వెలక్కాయ తిన్నట్టు పెట్టారు మొహం."

"అదీ... నీ కాఫీ తాగుతూన్నప్పుడు కాబోలు! కానీ అవంతిని చూస్తున్నప్పుడు వాళ్లకి అవంతి నచ్చినట్టుగానే అనిపించింది నాకు" నెమ్మదిగా అన్నాడు నవ్వుతూ, పార్వతి మూడ్ మార్చే ప్రయత్నంలో.

"ఛ! ఊరుకోండి. జోక్ వెయ్యడానిక్కూడా, ఒక సమయమూ, సందర్భమూ వుండాలి. ఈ దేవేరి వాళ్లకి నచ్చలేదు. ఈ శని నాకు వదిలేటట్టు లేదు. వాళ్లమ్మ కని పారేసి కళ్లు మూసుకుంది. నాన్న సంసారం కంటే సన్యాసమే సుఖమని దేశాలు పట్టిపోయాడు. బోడి ఆరు తులాల బంగారం పాతికవేలు ఇన్సూరెన్సు. పెళ్లెట్టా చెయ్యాలి. అక్క కూతురని ఆప్యాయంగా ఆదర్శవంతంగా ఇంటికి పట్టుకొచ్చేశారు. ఏం? తల్లి పోయే నాటికి అవంతి పసిపిల్లేం కాదు కదా? పదో క్లాసు చదువుతోంది. ఏ హాస్టల్లోనయినా పెడ్తే ఏమయ్యేదట?" ఆమె గబగబా దండకంలా చదివేస్తోంది.

"తల్లి తరవాత మేనమామంటారు. నేను ఈ ఊళ్లోనే వుండగా దాన్ని హాస్టల్లో పెడితే నలుగురూ ఏమనుకుంటారు? అయినా ఒకరనుకుంటారని కాదు. ఆమాత్రం ఆ పిల్లకి అండగా నిలిస్తే మన సొమ్మేం పోతుంది?" అదే స్థాయిలో సమాధానం చెప్పాడు శివప్రసాద్.

"ఛస్తున్నాను చాకిరీ చెయ్యలేక. నీతులు నేనూ చెప్తాను" మరింత రెచ్చిపోతూ అంది పార్వతి.

"ఏమిటీ నువ్వు దానికి చేస్తున్న చాకిరీ. మెట్రిక్ పాసయ్యిందో లేదో చదువు మాన్పించి, దానిచేత ఇంటెడు చాకిరీ చేయిస్తున్నావు. వాళ్లమ్మే బతికుంటే అది ఈరోజు లక్షణంగా ఏ.ఎమ్.ఏనో చదివి వుండేది. అది నీకు చాకిరీ చేస్తోందే. నువ్వు చేస్తున్నదేమిటి దానికి తిట్లూ శాపనార్థాలూ పెట్టడం తప్ప" ఈసారి శివప్రసాద్ కోపం తారస్థాయికి చేరుకుంది.

"ఏదో కాస్త ఇంట్లో పనిచేస్తే ఆ సుకుమారి కంది పోతుందా? దురదృష్టపు జాతకురాలు. ఎమ్.ఏ.లూ ఎమ్.బి.బి.ఎస్.లూ చదివే అదృష్టం వుంటే, తల్లినెందుకు మింగేస్తుందీ? ప్రతీసారీ పెళ్లి చూపులంటూ ఎవరో రావడం, కాఫీలు ఫలహారాలూ చెయ్యడం వాళ్లవన్నీ మెక్కి వెళ్లడం, ఆ తరవాత నచ్చలేదనో గిచ్చలేదనో తిరిగి చూడకపోవడం ఇప్పటికి పదిసార్లయింది. నేవేగలేను. ఈ తతంగం అంతా నేను పడలేను గనకే మూడోసారి గర్భవతినని తెలిశాక స్కానింగ్ చేసినప్పుడు ఆడపిల్లని తెలీగానే గర్భవిచ్ఛేదం చేయించుకున్నాను" కోపంతో గబగబా అనేసి నాలిక్కరుచుకుంది పార్వతి.

"ఏమిటీ ఆడపిల్లని తెలిసి అబార్షన్ చేయించుకున్నావా?" ఆశ్చర్యంగా అడిగాడు శివప్రసాద్.

"..................."

"మాట్లాడవేం?" గద్దించాడు.

"ఏమిటి మాట్లాడేది చెప్పానుగా. సురేశ్, సుభాష్ చక్కగా రెండు

కళ్లలా ఇద్దరు మొగపిల్లలుండగా ఆడపిల్ల అనవసరపు ఖర్చని, మీరు టూరెళ్లినప్పుడు ఆ పని చేశాను'' లాభం లేక నిజం చెప్పేసింది పార్వతి.

"ఓసి దౌర్భాగ్యురాలా! ఎంత పని చేశావే. ఇంటికి ఆడపిల్ల వుంటే ఎంత అందమే! ఆప్యాయతా అభిమానానికి నిలయమే ఆడపిల్లలు. అలా ఎలా చెయ్యగలిగేవ్? నువ్వాడదానివి కావా? మీ అమ్మ నీలాగా అనుకునుంటే నువ్వెక్కడుండేదానివిప్పుడు? అంత నీచానికెలా ఒడిగట్ట గలిగావ్? నిన్ను చంపినా పాపం లేదు'' కోపంతో ఒణికిపోయాడు శివ ప్రసాద్.

అవంతి గుండెలో గునపం గుచ్చుకున్నట్టయింది పార్వతి మాటలకి. ఆమెకి పార్వతి రాక్షసత్వం, తనను తిట్టే తిట్లు, పెట్టే శాపనార్థాలూ అలవాటయి పోయినా, అంతా మామయ్య మొహం చూసి అతని మంచితనం చూసి ఊరుకుంది. కానీ ఈ నిముషంలో ఆమె నోటి నుంచి తను విన్న మాటలకి షాక్ కొట్టింది, చెంపల మీదుగా కన్నీరు జలజలా రాలి గుండెని తడిపేస్తున్నాయి.

"వెధవ దరిద్రం. శనిలా దాపురించింది నాకు. వాళ్లమ్మలాగే ఇదీ చస్తే పోయేది. నన్ను చంపేలా వుంది. నా కాపురంలో నిప్పులు పొయ్యడానికే నా యింటికొచ్చినట్టుంది. లేకపోతే ఇన్ని సంవత్సరాలుగా నా గుండెల్లోనే దాచుకున్న ఆ విషయం ఇవ్వాళ ఇలా నోరు జారి బయట పడింది'' అంటూ మళ్ళీ దండకం అందుకున్న అత్తయ్య నోరు ఒక్కసారిగా మూతపడడం, "ఛెళ్లు'' మని కొట్టిన చప్పుడూ ఒక్కసారే జరగడంతో ఒణికిపోతూ అటుకేసి తొంగి చూసింది అవంతి. మామయ్య రుద్ర నరసింహుడిలా వున్నాడు కోపంతో ఊగిపోతూ.

"కొట్టండి! చంపండి! దానికోసం మీరేమైనా చేస్తారు. నాకన్నా మీకది ఎక్కువయిందే?'' రొప్పుతూ సెగలు కక్కుతూ అంది.

"ఛీ... నోర్మూసుకో....'' అసహ్యంగా ఆమెకేసి చూసి బయటికెళ్లి పోయాడు శివప్రసాద్.

"ఎందుకు నోర్మూసుకోవాలి? మీరొక్కరే మామయ్యున్నారా దానికి? ఎవరూ రమ్మని దగ్గరుంచుకోలేదే మీలాగా! మీకేనా అది అక్క కూతురు? ఎవరికీ లేని ప్రేమ మీకే ఎందుకు? అసలది నన్ను చంపడానికే బతికున్నట్టుంది. లేకపోతే ఏ రోగమో వచ్చి పోగూడదే ఇది కూడా, లేకపోతే ఉరేసుకు చావకూడదా? ఇప్పటివరకూ పదిమంది చూసి వెళ్లారు. ఒక్కరికీ నచ్చలేదే. వీళ్లకి మాత్రం నచ్చి చస్తుందా?'' "ఛీ.... ఛీ!'' శివప్రసాద్ అక్కడ లేకపోవడంతో మరీ గట్టిగా అరిచింది పార్వతి. పార్వతి ప్రతి మాటా ములుకుల్లా గుచ్చుకున్నాయి అవంతికి.

ఇంతకు ముందు ఆమె అన్నట్టుగానే పదిసార్లు పెళ్లి వారొస్తున్నారని, పట్టుచీర కట్టుకుని, పువ్వులు పెట్టుకుని ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలన్నింటికీ తలొంచుకుని సమాధానాలు చెప్పడం, పెళ్లికొడుకూ ప్లస్ అతనితో వచ్చిన వాళ్లందరూ తినేసేలా తనని చూడడం, ఆ తరవాత కట్నాలు సరిపోవనో, పిల్ల చదువు సరిపోలేదనో, ఉద్యోగం చేసే పిల్ల కావాలనో, ఏదో వంకతో కాన్సిల్ చేసుకోవడం. సంతలో పశువులా ఎన్నిసార్లు తను అందరి ఎదుటా అలా కూర్చుంది? ఛీ.... తనకైనా సిగ్గుండాలి'' అనుకుంటూ ఆ మూల అలాగే చతికిలబడి గంటల కొద్దీ ఏడ్చింది.

పార్వతి దండకం చదువుతూనే వుంది. ఆ తరవాత అలసిపోయిన దానిలా నోరు మూసుకుని పనిలో పడిపోయింది. వాతావరణం తుఫానొచ్చి వెలిసినట్టుగా వుంది.

అప్పుడే బయట నుంచి లోపలికి అడుగు పెట్టిన శివప్రసాద్ అవంతి దగ్గరకొచ్చి "నువ్వింకా ఇలాగే కూర్చున్నావా? మీ అత్తయ్య మాటలకి బాధ పడుతూ ఏడుస్తున్నావా తల్లీ! బాధపడకమ్మా! నీకూ మంచి రోజులొస్తాయి! నాకెందుకో ఇందాకొచ్చి వెళ్లిన ఈ బ్యాంకబ్బాయి సంబంధానికి నువ్వు నచ్చావనే అన్పిస్తోంది. అబ్బాయి తల్లీ, తండ్రీ కూడా ఉత్తముల్లాగే అనిపిస్తున్నారు'' అన్నాడు. అవంతి తలని ఆప్యాయంగా నిమురుతూ. అవంతి పసిపిల్లలా అతణ్ణి చుట్టేసి బావురుమంది. అతడి కళ్లూ తడయ్యాయి. అవంతి లేచి వెళ్లి బట్టలు మార్చుకుని, పనిలో పడిపోయింది.

దాదాపు రెండు వారాలు గడిచిపోయినా పెళ్లివారి నుండి, పిల్ల నచ్చినట్టుగానీ, నచ్చనట్టుగానీ సమాధానం రాలేదు. "వీళ్లకీ ఏదో అడ్డొచ్చిందా? నచ్చనట్టేనా? మరోసారి పెళ్లిచూపులకి సిద్ధం కావాలి కాబోలు'' అవంతి గుండెల్లో గుబులు అలుముకుంది. దానికి తోడు ఆరోజే పార్వతి మళ్లీ పురాణం మొదలెట్టింది.

"పంచాంగం విప్పావా? ఇంకా లేదే అనుకుంటున్నా!'' అన్నాడు శివప్రసాద్.

"ఈసారి పెళ్లిచూపులూ అని ఎవరన్నా అన్నారో 'దానికి పెళ్లి కాదు, మీరు రాకండి' అని ముందే చెప్పేస్తా. ఆ తతంగం ఇంక నావల్ల కాదు''



## వృద్ధుల సేవలో 'సంధ్యా జ్యోతి'

ఒంట్లో శక్తి వున్నంత కాలం కుటుంబం కోసం శ్రమించి శక్తి తగ్గిన తరువాత కన్నవారి ఆదరణకు లోనయ్యే వారు నేడు ఎంతో మంది వున్నారు. అలాంటి వారి కోసం నెల కొల్పబడి, వృద్ధుల పాలిట ఆశాజ్యోతిలా వెలుగొందుతోంది పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలోని "సంధ్యాజ్యోతి'' వృద్ధుల సంరక్షణ కేంద్రం.

1986లో కేవలం ఒక వృద్ధ అంధ మహిళతో ప్రారంభమైన ఈ కేంద్రంలో ప్రస్తుతం 25 మంది వున్నారు. ఈ సేవా సంస్థ కార్యక్రమాలను గుర్తించిన పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు భవన నిర్మాణం కోసం 1.14 సెంట్ల భూమిని ఇచ్చారు.

అందులో నూతన భవనాన్ని ఈ సంస్థ ఏర్పాటు చేసుకోగా దీనిని ఇటీవల కేంద్ర స్త్రీ, సంక్షేమ శాఖ మంత్రిణి శ్రీమతి బసవ రాజేశ్వరి ప్రారంభించారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ సంస్థకు ఎలాంటి ఆర్థిక సహాయం అందించకపోయినా దేశ విదేశాలలోని మిత్రులు, స్వచ్ఛంద సేవా సంస్థలతో పాటు తణుకు పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు, సంస్థలు సహాయం అందించటంవలననే ఈ కార్యక్రమాలు నిర్వహించగలుగుతున్నామని 'సంధ్యాజ్యోతి' కార్యదర్శి కుమారి రాధ తెలియజేస్తున్నారు.

ప్రస్తుతం 200 దరఖాస్తులు తమ వద్ద పెండింగ్‌లో వున్నాయని నూతన భవనంలోకి ఈ సంస్థను మార్చిన తరువాత కొత్తవారిని చేర్చుకుంటామని రాధ అన్నారు.

ప్రభుత్వ సహాయం లేకపోయినా కేవలం స్వచ్ఛంద సంస్థలు, సేవా పరాయణులు అందిస్తున్న సహాయ సహకారాలతో ఈ సంస్థను నడిపిస్తూ వృద్ధుల జీవితంలో ఆశా జ్యోతిని వెలిగిస్తున్న 'సంధ్యాజ్యోతి' నిర్వాహకురాలు కుమారి రాధ అభినందనీయురాలు.

-ఎల్. వెంకటరత్నం

ఖచ్చితంగా అంది పార్వతి. ఆ మాటలు అవంతి చెవుల్లో గింగురుంగు మన్నాయ్! ఏ పని చేస్తూన్నా ఆ మాటలే గుర్తుకొస్తున్నయ్. నీరసం ముంచుకొచ్చింది. గబగబా బాత్‌రూంలో కెళ్లి తలుపులు మూసుకుంది!

* * *

ఇల్లంతా ఏడుపులతో పెడబొబ్బలతో బంధువులతో, స్నేహితులతో అయినవారితో కాని వారితో క్రిక్కిరిసి పోయింది.

"బొద్దింకల మందు తాగేసిందట! ఏం పోయే కాలం?" అంది ఒకావిడ.

"ఏమోనమ్మా ఈ కాలపు పిల్లల్ని ఎవరు నమ్ముతున్నారు. ఏం తిరుగుళ్లు తిరిగిందో! కడుపో కాలో తెచ్చుంటుంది. చచ్చూరుకుంది" మరో ఆవిడ గుస గుస.

"అందులో తల్లీ తండ్రీ లేరాయె. చెప్పేవాళ్లెవరూ, మంచీ చెడూనూ" దీర్ఘం తీసింది మరో గొంతు.

అంతలో శవం చీరకొంగు ముడిలో ఈ ఉత్తరం దొరికిందని తీసిచ్చాడు పోలీసు కానిస్టేబుల్, ఉత్తరాన్ని ఇన్స్‌పెక్టరుగారికిస్తూ.

ఇన్స్‌పెక్టరు అది చదివి శివప్రసాద్ కిచ్చాడు.

శివప్రసాద్‌కి అక్షరాలు కనబడడం లేదు.

మెల్లగా కూడబలుక్కుని, కళ్లు తుడుచుకుని పైకే చదివాడు.

మామయ్యా, నమస్కారం! ఇదే నీకు నా తుది నమస్కారం. పెళ్లి కొడుకుల వేటలో, పెళ్లిచూపుల సంతలో అమ్ముడుపోని, అమ్ముడు కాని దౌర్భాగ్యురాలిని. ఆ తతంగంలో అత్తయ్యే కాదు, నేనూ విసిగిపోయాను. ఈ నికృష్టపు జీవితానికి స్వస్తి చెప్పాలని, మా అమ్మను కలుసుకోవడానికి వెళ్లిపోతున్నాను. మళ్లీ జన్మంటూ వుంటే నీ కడుపునే పుడతాను. అత్తయ్యతో చెప్పు ఆడపిల్లగా మాత్రం పుట్టను. ఉంటాను. బతికి అత్తయ్యనీ, చచ్చి నిన్నూ బాధపెడుతున్నాను. ఏం చెయ్యను? నీకూ అత్తయ్యకు నా చివరి నమస్కారం. నన్ను మన్నించండి.

ఇట్లు
అభాగిని
అవంతి

ఉత్తరం చదివి గొల్లుమన్నాడు శివప్రసాద్. అక్కడున్న వాళ్లందరి కళ్లూ వర్షించాయి. అవంతికేసి చూసి కన్నీటి బొట్లు రాల్చని వారు లేరు. భగవంతుడూ కరిగిపోయాడేమో! 'టెలిగ్రాం' అన్న పిలుపు విని అందరూ అటుకేసి చూశారు. గుంపులోంచి ఎవరో వెళ్లి సంతకం చేసి టెలిగ్రాం అందుకున్నారు.

"బాయ్.... లైక్‌డ్...ది....గర్ల్ ... ఫిక్స్ ది మ్యారేజ్. నెక్స్ట్ మంత్.... నో డౌరీ.... రిక్వైర్డ్ ప్లీజ్...."

పిచ్చివాడిలా అరిచాడు అది చదివిన శివప్రసాద్. "అవంతీ లేచి రావమ్మా..." అంటూ.

అతడి మాటలకి భూమి దద్దరిల్లింది!

ఆకాశం కంపించింది!

మేఘాలకి చిల్లులు పడ్డట్టు వర్షం ప్రారంభమయింది!

కన్నీరు, వర్షపు నీరై సెలయేరులా ప్రవహించింది. అందులో ఆనందంగా సాగించింది అవంతి తన ప్రయాణాన్ని!

"అవంతీ! ఎందుకమ్మా తొందరపడ్డావ్? ఈ పెళ్లికొడుకుల సంతలో నువ్వు అమ్ముడుపోనందుకు, నిన్ను నిన్నుగా ప్రేమించేవాడు దొరికేదాకా ఆగినందుకూ నువ్వు గర్వపడాలమ్మా! సిగ్గుపడవలసిందీ, తల దించుకోవలసిందీ సమాజమమ్మా నువ్వు కాదు. నిన్ను నిన్నుగా ప్రేమించేవాడు దొరికాడు తల్లీ! లేచిరా! అమ్మా.... అవంతీ...."

అతనిని ఆపటం జనానికి సాధ్యం కావడం లేదు. మబ్బులు క్రమేపీ వర్షం తీవ్రమై అందరినీ తరిమేస్తోంది!

ఆ గదిలో ఉచ్ఛ్వాశ నిశ్వాసాల శబ్దం తప్ప అంతా చీకటి విసిరిన నిశ్శబ్దం ఆవరించింది! ❑


అశ్విని మజిల్ ఆయిల్

మోకాళ్ళ నొప్పులు, బెణుకులు, వొళ్ళు నొప్పులు, మరియు కండరాల నొప్పులను నివారించే దివ్య ఔషదం.






మీరు అశ్విని మజిల్ ఆయిల్ ను నొప్పి వున్న చోట మెల్లగా ఉదయం,రాత్రి మసాజ్ చేయండి. త్వరితంగా నివారణ పొందండి.

**వాడిన వారి కొందరి అభిప్రాయములు**

**38** సంIIలు వయస్సు గల నాకు అకస్మాత్తుగా మోకాళ్ళు, మోచేతులలో నొప్పి ప్రారంభమైనది. నా వయస్సులో రాకూడని ఈ నొప్పులు డాక్టర్లకు కూడా అంతుబట్టలేదు. అన్ని రకాల వైద్యాలు వాడాను. ఈ నొప్పులతో నా ఆరోగ్యం క్రమంగా క్షీణించసాగింది. మా ఇంటికి వచ్చిన మా అన్నయ్యగారు నా అనారోగ్యానికి కారణం అడుగగా, ఈ నొప్పుల గురించి తెలిపాను. ఆయన నాకు "అశ్విని మజిల్ ఆయిల్" తెచ్చి ఇచ్చారు. ఈ ఆయిల్‌ను వాడిన తరువాత కొన్ని వారాల్లో ఇంతకు ముందు నాకు ఉన్నటువంటి అన్నిరకాల కీళ్ళ నొప్పుల నుంచి నివారణ కలిగిందని తెల్పటానికి చాలా సంతోషిస్తున్నాను. మళ్ళీ నాకు పూర్వపు స్వస్థత చేకూరింది.

Smt. T. Meenakumari, B.A., Sr. Asst. F.C.I. Hyderabad.

ఇది
అశ్వినీ వారి మరియొక విశిష్ట ఉత్పాదన.

ఇంటింటా వుండవలసిన
అద్భుత బాధా నివారిణి

MAC/AHP/935